

అది వెల్లూరు.

వెల్లూరు ప్రత్యేకత—

దేవుడులేని ఆలయం.

రాజులేని కోట.

నీరులేని నది.

మూడు నెలలయింది ప్రసాద్‌ని వెల్లూరు హాస్పిటల్‌లో చేర్పించి. స్పెషల్ వార్డ్‌లో మంచంమీద అలసటతో కళ్లు మూసుకొని పడుకున్నాడు ప్రసాద్. ఆ కళ్ళని తదేకంగా చూస్తూంది నర్స్ లత. కిటికీ తలుపు తెరిచి శూన్యాకాశంలో ఎగురుతున్న పక్షులను చూస్తూ నిం బడ్డాడు డాక్టర్ మధుసూదన్. రెండు చేతుల మధ్య తలను అన్చి కళ్ళు మూసుకొని, కుర్చీలో కూర్చున్నాడు రమేష్. బయట ఉన్న చెట్ల ఆకులు గాలికి చేస్తున్న శబ్దం స్పష్టంగా వినిపిస్తూంది. అది మినహా గదిలో నిశ్శబ్దం తాండవి స్తూంది. ఉదయం నుంచి ప్రసాద్‌కి ఎడమకాలిలో శూలాలు పొడిచినట్లు పోట్లు వస్తున్నాయి. ప్రసాద్ బాధ భరించలేకపోతుంటే 'సెడేటివ్' ఇచ్చారు. న్యూరో సర్జన్ డాక్టర్ విక్టర్ వచ్చి ప్రసాద్‌ని పరీక్షించి అప్పుడే వెళ్ళాడు. ప్రళయం ముందర ఉండే ప్రశాంతత లాటిది ఆ నిశ్శబ్దం. వెల్లూరికి వచ్చిన తరవాత వదోసారి మళ్ళా మొక్కుకుంది వెంకటేశ్వరస్వామికి లత. దేవుని నమ్మని డాక్టర్ మధుసూదన్, మానవుని ఈ అశక్తతని విజ్ఞాన ప్రగతి ఎప్పుడు జయి స్తుందో అనుకొని నిట్టూరుస్తున్నాడు. రమేష్ తన ఇష్టదైవం వినాయకుని ప్రార్థిస్తున్నాడు: "నా కోసం ఏమీ ఇంత వరకు కోరలేదు. ఇంక కోరను కూడా. కాని, ఈ ఒక్క విషయంలో నా ప్రార్థన ఆలకించు ..."

సంవత్సరం క్రితం...సరిగ్గా సంవత్సరం క్రితం...ప్రసాద్ యూనివర్సిటీలో కెమికల్ ఇంజనీరింగ్ ఆఖరి సంవత్సరం విద్యార్థి. ఇంకో రెండు నెలలలో మొదటి క్లాసులో ఉత్తీర్ణుడు అవగలడు. ఉజ్జ్వల భవిష్యత్తును ఆశించారు అందరూ. స్ఫురద్రూపి. అయిదడుగుల ఎనిమిది అంగుళాల ఎత్తు. బలమయిన శరీరం. చామనఛాయ. అయినా, కళ అయిన మొహం. నల్లటి నొక్కు నొక్కుల జుత్తు. అధ్యాపకులకు అభిమాన పాత్రుడు. తోటి విద్యార్థి బృందానికి తలలో నాలుక. యూనివర్సిటీలో కొందరు అమ్మాయిల గుండెల్లో నిట్టూర్పు. మన అర్హతలకి మరీ ఎక్కువ అనుకునే ఇంకొందరి అమ్మాయిల ఊహల్లో ఆరాధనపాత్రుడు. రెండు సంవత్సరాలుగా కాలేజీ ఎథ్లెటిక్ ఛాంపియన్. నాలుగు సంవత్సరాలుగా కాలేజీ డిబేటర్. ఇంతకన్నా ఎవరికయినా ఉండవలసిన దేమిటి అనుకొనేవారు ఎవరయినా ప్రసాద్‌ని చూసి.

ఆ రోజు కాలేజీ వార్షిక స్పోర్ట్స్ జరుగుతున్నాయి. చివరి పోటీ వంద మీటర్ల పరుగు పందెం. అది నెగ్గితే మూడోసారి 'ఛాంపియన్‌షిప్' ప్రసాద్‌దే. ఆ పందెంలో పాల్గొనే వాళ్ళకికూడా తెలుసు, ప్రసాద్ తప్పక గెలుస్తాడని. స్నేహిత బృందం అంతా ప్రసాద్ గెలుపు కోసం నిరీక్షిస్తున్నారు పూలదండలతో.

పి. డి. కేకవేశాడు: "ఆన్ యువర్ మార్క్స్!"

ఎన్. ఎస్. మణ్యమ్

రెండో 'లేన్'లో ఉన్న ప్రసాద్, మూడో 'లేన్'లో ఉన్న రమేష్ 'స్టార్టర్స్' మీద కాళ్ళు ఆన్చారు.

"సెట్!"

పరుగెత్తేందుకు సిద్ధంగా ఉన్నారు అందరూ.

గన్ మోగింది.

ఏభయి మీటర్లయింది. ప్రసాద్,

రమేష్ ఒకే వేగంతో పరుగెత్తుతున్నారు ప్రసాద్ చివరి 'గేలప్' తీయబోతున్నాడు అంతే. ఏమయిందో ఎవ్వరికీ తెలియదు మరో క్షణంలో నేలమీద పడిపోయారు ఇద్దరూ. చుట్టూ జనం హాహాకారాలు చేశారు. రమేష్ వెంటనే లేచాడు, మోచేతుల మీద గీరుకుపోయిన చర్మాన్ని తడుముకుంటూ. కాని, ప్రసాద్ లేవలేదు. అలాగే అపస్మారకంగా వెల్లకిలా పడి ఉన్నాడు. స్ట్రెచర్ తెచ్చారు వలంటీర్లు. దగ్గర్లో ఉన్న డాక్టర్ మధుసూదన్ హాస్పిటల్‌కి తీసుకెళ్ళారు. డాక్టర్ మధుసూదన్ ఆ ఊరిలో పేరెన్నిక గన్న డాక్టర్లలో ఒకరు. ఉదార హృదయుడు. పేదలపాలిటి పెన్నిధి. మంచి డాక్టరే కాకుండా, సర్జరీలో కూడా ఆయన హస్తవాసికి మంచి పేరుంది. కన్సల్టింగ్ రూమ్‌లోని బెడ్ మీద స్మారకంలోకి వచ్చిన ప్రసాద్ లేవడానికి ప్రయత్నించాడు. కాని, బాధతో మళ్ళా అలాగే పడుకున్నాడు.

"మీరంతా బయటికి వెళ్ళండి. పేషెంట్‌కి విశ్రాంతి అవసరం" అని నర్స్ లత అందర్నీ బయటికి పంపింది.

"ఏదయినా ప్రమాదమయిన గాయమా?" పి. డి. అడిగారు డాక్టర్ మధుసూదన్‌ని.

"ఎక్స్—రే తీసి చూడాలి. అప్పుడు కాని చెప్పడం కష్టం. ఎందుకయినా మంచిది — తల్లితండ్రులకి కబురు పంపండి."

"ప్రసాద్ తల్లితండ్రులు చిన్నప్పుడే పోయారు. కోనసీమలో ఒక పల్లెటూరు ప్రసాద్‌ది. వాళ్ళ అమ్మమ్మ తప్ప ఇంకెవరూ లేరు."

మరునాడు అందరికీ తెలిసింది — ప్రసాద్ వెన్నెముకకి కొద్దిగా దెబ్బ తగిలిందని, ఆపరేషన్ చేస్తారని. పరిచితుల పైకెళ్ళి అన్నాడు రమేష్:

"మధుసూదన్‌గారూ, మీకు గుర్తుందా? సరిగ్గా ఈ వేళకి సంవత్సరమయింది." దూరమౌతున్న పక్షుల మంచి దృష్టి మరల్చి, "అవును, రమేష్. నేనూ ఆ రోజు గురించే ఆలోచిస్తున్నాను. ఒక్క సంవత్సరం... ఎన్నో ఆశల భవిష్యత్తుకూ, విస్తార వర్తమానికీ; చైతన్యానికీ, నిర్జీవ అంధకారానికీ వారధి ఈ ఒక్క సంవత్సరం" అని ఆగి, లత, రమేష్‌లను చూస్తూ అన్నాడు: "మీకు దేవుడంటే నమ్మకముందా?" తలలు ఊపారు ఇద్దరూ. "అదృష్టవంతులు. కనీసం మీ మనస్సులయినా ప్రశాంతంగా ఉంటాయి. భారమంతా ఆ దేవుడిమీద వేసి. నాకా అదృష్టం కూడా లేదు.

ప్రేమే స్వర్గం

విశ్వవ్యాపకంగా ప్రేమించేవాని హృదయం భూలోక స్వర్గమే - సందేహం లేదు. ఎందుకంటే అతనిలో భగవదంశ కనిపిస్తుంది. భగవంతుడంటేనే ప్రేమ.

—లామనైస్

నదిలో మునిగిపోతున్న పిల్లవాడిని చూస్తూ ఈత రాని వ్యక్తి పడే బాధలాంటి అశక్తత నాది."

గది బయటికి వచ్చి సిగరెట్ ముట్టించి అక్కడ బల్లమీద కూర్చుని ఆలోచిస్తున్నాడు డాక్టర్ మధుసూదన్. 'అవును. ఆ రోజు బాగా గుర్తుంది. ఎక్స్—రేలో వెన్నెముక పై భాగం కొంచెం దెబ్బతిన్నట్లు చూపింది. ఆపరేషన్ పెద్ద కష్టమయినది కాదు. మరునాడు ఆపరేషన్ చెయ్యడానికి సిద్ధపరిచాడు. తను ఎప్పుడు ఆపరేషన్ చేసినా ఉదయమే చేస్తాడు. మనస్సు నిర్మలంగా ఉండి ఆపరేషన్ మీద పూర్తి శ్రద్ధ చూపించడానికి వీలుంటుంది ఉదయమయితే. "ఎనిస్థటిస్ట్" కి కబురు పంపి, లతతో ఆపరేషన్ ఏర్పాట్లు పురమాయించి ఇంటికి వెళ్ళాడు. పేపర్ చదువుతుంటే ఫోన్ మోగింది. డాక్టర్ సత్యనారాయణ. మరునాడు మద్రాస్ వెళుతున్నాడు. మద్రాస్ నుంచి రెండు సంవత్సరాలు లండన్‌లో కింగ్స్ హాస్పిటల్‌లో ట్రెయినింగ్‌కి వెళుతున్నాడు. ఆ సాయంత్రం 'స్కాచ్' పార్టీ ఇస్తున్నాడు. "తప్పకుండా రావాలి. మళ్ళా రెండు సంవత్సరాలకి కాని కలవం" అని మరీ మరీ చెప్పాడు. తన ముఖ్యమయిన స్నేహితులలో డాక్టర్ సత్యనారాయణ ఒకడు. నిజానికి రెండు రోజుల క్రితమే తను డిన్నర్ పార్టీ ఇచ్చాడు. ఏ పార్టీ కూడా తిరిగి ఇవ్వకపోతే సత్యనారాయణకు నిద్రపట్టదు. తమాషా మనిషి. వెళ్ళక తప్పదు అనుకుంటూ సిద్ధమయ్యాడు తను.

"షివాస్ రేగల్" ప్రవాహంగా పారింది ఆ రాత్రి. తను ఎక్కువ తీసుకోలేదు కూడాను. డాక్టర్ సత్యనారాయణ జలవంతం చేస్తుంటే మరునాడు ఆపరేషన్ గురించి కూడా చెప్పాడు తను.

"ఓస్! ఆ ఆపరేషన్‌కే ఇన్ని జాగ్రత్తలా? కళ్ళు మూసుకొని చెయ్యొచ్చు" అంటూ పరిహాసం చేశాడు. రాత్రి ఒంటిగంటయింది ఇంటికి వచ్చి పడుకునేటప్పటికి. ఆరు గంటల నిద్ర తరవాత మామూలు మనిషి అయ్యాడు తను. కనీసం అయ్యానని అనుకున్నాడు. తొమ్మిది గంటలకి ఆపరేషన్ మొదలయింది. "స్టిచెస్" అన్నీ పూర్తిచేసేటప్పటికి పదిన్నర అయింది. మిగతా పనులన్నీ జూనియర్‌కి, నర్స్ లతకి అప్పచెప్పి నర్సింగ్‌హోమ్‌లో పేషెంట్లని చూడడానికి వెళ్ళాడు తను.'

డాక్టర్ మధుసూదన్ ఆలోచనలకు అంతరాయం కలిగిస్తూ రమేష్ వచ్చాడు గదిలోంచి — "ఒకసారి అలా తిరిగి వద్దాం, డాక్టర్ గారూ. నా కిక్కడ మతిపోతోంది" అంటూ.

రమేష్, డాక్టర్ మధుసూదన్ కొంత దూరం బయట నడిచి ఒక చెట్టుక్రింద కూర్చున్నారు. గదిలో ఒక్కతే ఉన్న లత ఇంకా నిద్రపోతున్న ప్రసాద్ జుట్టుని సవరించి నుదురు రాస్తూ అనుకొంది: 'సంవత్సరమా! యుగాలయినట్లుంది. స్ట్రెచర్‌మీద తీసుకొని వచ్చిన ప్రసాద్‌ని మొట్టమొదట చూడగానే ఎవ్వరో ఆత్మీయుణ్ణి చూసినట్లనిపించింది తనకి. అలాంటి భావన కలగడం జీవితంలో మొదటిసారి అది. నర్స్ ట్రెయినింగ్ అవుతున్నప్పుడు హాస్పిటల్‌లోని హౌస్ సర్జన్లు, కుర్ర డాక్టర్ల ఆకలి చూపులకు, వెకిలి చేష్టలకు లొంగని తను, అందమయిన దానివి, ఎవడో ఒకణ్ణి బుట్టలో పెట్టు అనే సీనియర్ నర్సుల సలహాలను చెవిని పెట్టని తను, "ఫ్లారెన్స్ నైటింగేల్



చిత్తూరు ఆర్ట్స్ లవర్స్‌వారు ఇటీవల మద్రాసు మధుర కళా నికేతన్ ఆధ్వర్యంలో ప్రదర్శించిన శ్రీ ముని సుందరం రచించిన 'ఇది కథ కాదు' నాటికలో ఒక దృశ్యం.

"గెలురా నాయనా" అని తోటి నర్సులు తనని అపహాస్యం చేస్తున్నప్పుడు తన బాధ్యతలని విస్మరించని తను, ఆ రోజు ప్రసాద్‌ని మొట్టమొదట చూసినప్పుడు కలిగిన భావోద్వేగానికి కారణం ఏమిటో తన కిప్పటికీ అవగాహన కాలేదు. అతనికి ఆపరేషన్ చేస్తారని తెలిసినప్పుడు ఒక విధంగా సంతోషించింది తను — అతని సాన్నిధ్యం ఇంకా కొంతకాలం లభిస్తుందని. ఆపరేషన్ అయిన పది రోజులలో ప్రసాద్‌తో చనువు ఏర్పడింది. "ఎందుకు, నర్స్, నాకోసం మీరింత కష్టపడతారు?" అనేవాడు ప్రసాద్. "నన్ను లతా అని పిలవండి" అని తను ఎంతో ప్రయత్నం మీద అంటే, అతను నవ్విన చిరునవ్వు గుండెల్లో మల్లెలు పూయింప జేసింది. ఒకసారి ప్రసాద్ నిద్రపోతున్నా డనుకొని అతని మొహంకేసి అలా చూస్తుంటే, కళ్ళు తెరిచిన ప్రసాద్ నవ్విన కొంటె నవ్వు చూసి ఎంత సిగ్గుపడింది తను! మరునాడు "డిస్చార్జి" చేస్తారనగా ఆ సాయంత్రం — "మీరు రేపు వెళ్ళిపోతారు. నేను ఇక గుర్తుంటానా?" అన్నప్పుడు, "లతా! నాకు అమ్మమ్మ తప్ప ఎవరూ లేరు. అటు తల్లిదండ్రుల అనురాగాన్నికాని, సోదరీ సోదరుల ప్రేమలను గాని నోచుకోని వాణ్ణి. ఈ పదిహేను రోజులలో నీవు చేసిన సేవ, చూపిన అభిమానం మరిచిపోగలనా?" అని కొంతసేపాగి, "నా మనస్సు పూర్తిగా వివరించి నీ భవిష్యత్తును బంధించే సమయం ఇంకా రాలేదు. నా కాళ్ళమీద నేను నిలబడగల స్తోమతు వచ్చినప్పుడు, నేను జీవితంలో స్థిరపడే రోజు వచ్చినప్పుడు నా ఆలోచనలో నువ్వే ఉంటావు. అంతవరకు నా కోసం వేచి ఉండమనేటంత స్వార్థపరుడినికాను. కాని, అలా జరిగినప్పుడు నా అంత అదృష్టవంతుడు ఇంకెవరూ లేరని తలుస్తాను" అని ప్రసాద్ అన్నప్పుడు తను వేరే ఇంకొక లోకంలో ఉన్నట్లనిపించింది. ఆ రాత్రి ఎంత చక్కటి కలలు కన్నది తను! మధుర స్వప్నాలలో ఉన్న తనని "ఆయా" తెల్లవారగట్ల లేపింది— "ప్రసాద్ బాబు మీకోసం కబురు పంపారు" అంటూ.

తనని చూసి ప్రసాద్ నీరసంగా, ఇబ్బందిగా నవ్వాడు. "సారీ, లతా! నా కేమౌతూందో తెలియడం లేదు. ఒళ్ళంతా సూదులు పొడిచిన ట్లనిపిస్తోంది. రాత్రి నుంచి 'యూరిన్' కూడా సరిగ్గా అవ్వడం లేదు. చాలా బాధపెడుతూంది. డాక్టర్ గారిని వెంటనే పిలవండి." తను డాక్టర్ మధుసూదన్‌కోసం పరుగెత్తింది.

"మంచినీళ్ళు, లతా" అన్న ప్రసాద్ పిలుపుతో వాస్తవంలోకి వచ్చింది లత.

"డాక్టర్ గారూ, దీనికంతా నేనే బాధ్యుడనిపిస్తోంది. ఆ రోజు 'రేస్'లో నా కాళ్ళు ప్రసాద్ కాళ్ళకి తగలకపోతే అతను పడి ఉండే వాడు కాడు. ఇదంతా జరిగి ఉండేదికాదు" అన్నాడు రమేష్ చెట్టుక్రింద కూర్చుని ఎండిన ఆకుని గోటితో చీలుస్తున్న డాక్టర్ మధుసూదన్ కేసి చూస్తూ.


"డోంట్ బి సిల్లీ, రమేష్! ఏది, ఎప్పుడు, ఎలా జరుగుతుందో ఎవ్వరు చెప్ప గలరు? నీ కాళ్ళు అడ్డుపడటం లాంటి ప్రమాదాలు జరగడానికి అవకాశాలు లేక పోలేదు."

"అది ప్రమాదం కాదండీ. ఇంత వరకూ ఎవ్వరికీ ఈ విషయం చెప్పలేదు. ఆ రోజు వంద మీటర్ల 'రేస్'లో ప్రసాద్ నెగ్గకపోతే నా స్నేహితుడు ఇంకొక అతనికి 'ఛాంపియన్‌షిప్' వచ్చేది. ప్రసాద్‌కి ఆ 'రేస్' లో ఏమీ పాయింట్లు రాకపోతేనే! అంటే మూడవ స్థానం కూడా రాకపోతేనే, నా స్నేహితుడు ఛాంపియన్ అవుతాడు. అంటే అతనికి జంప్స్, త్రోస్‌లలో నాలుగు ఫస్ట్‌లు, ఒక థర్డ్ వచ్చాయి. ప్రసాద్‌కి 'రన్స్' లోనే నాలుగు ఫస్ట్‌లు వచ్చాయి అప్పటికే. ఆ వంద మీటర్ల రేస్ కూడా నెగ్గితే ప్రసాదే ఛాంపియన్ అవుతాడు. నా స్నేహితుడు ప్రసాద్‌ని ఎలాగో అలాగ థర్డ్ కూడా రాకుండా చేయమని అంతకు ముందర రోజు ప్రార్థించాడు నన్ను. ఒక బలహీన క్షణంలో నేను ఒప్పుకున్నాను. దాని పర్యవసానమే ఇది. అందరూ అనుకొన్నట్లు అది ప్రమాద వశాత్తు జరిగింది కాదు, డాక్టర్‌గారూ. నేను కావాలని చేసింది అది" అన్నాడు రమేష్ చేతుల్లో మొహం దాచుకొని ఏడుస్తూ.

"రమేష్, ఊరుకో. గెలుపు, ఓటములకు అర్థంలేని ప్రాధాన్యం ఇచ్చే వయస్సు అది. ప్రసాద్ పరిస్థితికి నీ బాధ్యత ఎంత ఉంటుం దనుకొంటున్నావో, అంతకన్న ఎక్కువ బాధ్యత నామీదే ఉందనుకొంటున్నా నంటే నువ్వు నమ్మకపోవచ్చు."

"అంటే ..." అన్నట్లు ప్రశ్నార్థకంగా చూశాడు రమేష్.


"ప్రసాద్‌కి వచ్చిన వ్యాధిని 'డిస్సిమినేటెడ్ స్క్లెరోసిస్' అంటారు. అమూహ్యమైన కారణాలవల్ల 'నెర్వస్ సిస్టమ్' కి వచ్చే వ్యాధి ఇది. నెర్వస్ సిస్టమ్‌లో ప్రధాన భాగాలు మెదడు, వెన్నుపూస. మనం చేసే అన్ని పనులు— అంటే చూడటం, వినడం, స్పర్శ, రుచి మొదలయినవి అన్నీ మెదడు ఆజ్ఞల ద్వారానే జరుగుతాయి. అంటే మెదడు టెలిఫోన్ ఎక్స్చేంజి లాటిదన్న మాట. ఆ ఆజ్ఞలు వెన్నుపూస ద్వారా ఆయా భాగాలకి చేరతాయి. ఈ వ్యాధివల్ల వెన్నుపూస, మెదడు దెబ్బ తింటాయి. అలాగని వ్యాధిలక్షణం ఇది ఒక్కటే అని చెప్పలేం. మెదడు ఆజ్ఞాపించే ఏ భాగమయినా ఈ వ్యాధివల్ల పనిచెయ్యలేక పోవచ్చు. అంటే కాళ్ళలో నిస్సత్తువ, ఒళ్ళు తిమ్మిరెక్కడం, విపరీతమైన నొప్పులు, మూత్రద్వారం బంధన, ఒక కంటిలో దృష్టి పోవడం, ఒక చెవి వినపడకపోవడం, రెండు ఆకారాలు కనబడడం, ఫిట్లు రావడం — ఇలాటి లక్షణాలు అన్నీ ఒకదాని తరవాత ఒకటి రావచ్చు; లేదా కొన్నే రావచ్చు. ఒక్కొక్కసారి ఈ లక్షణాలన్నీ ఒకదాని తరవాత ఇంకొకటి రెండు, మూడు నెలల వ్యవధిలో రావచ్చు. అదృష్టముంటే ఒక లక్షణం వచ్చిన తరవాత కొన్ని నెలలయిన తరవాత అది తగ్గి మామూలు మనిషి కావచ్చు. ఈ వ్యాధి ప్రత్యేకత ఏమిటంటే, నే విందాకా చెప్పినట్లు ఇది ఎలా వస్తుందో ఎవ్వరికీ తెలియదు, దాని ప్రతాపం రోగిమీద ఎలా చూపిస్తుందో కూడా చెప్పడం కష్టం. కొన్ని లక్షణాలకి రిలీఫ్ ఆపరేషన్‌లు జరపొచ్చు. కాని, దానివల్ల పెద్ద లాభంలేదు. ఎందుకంటే, మెదడులో ఇంకో భాగం తరవాత దెబ్బతినవచ్చు. నిజానికి నే ననుకోవడం ప్రసాద్ ఆ రోజు పడిపోవడం కేవలం నీవల్లనే కాకపోవచ్చు. ఈ వ్యాధి మొట్టమొదటి ప్రతాపం అదే క్షణాన చూపి ఉండవచ్చు. కాళ్ళలో అకస్మాత్తు నిస్సత్తువ వల్ల పడిపోయి ఉండవచ్చు. కాని, డాక్టరుగా నేను అది గుర్తించలేకపోయాను అప్పుడు. నిజానికి ఎంత ప్రసిద్ధుడయిన డాక్టరయినా గుర్తించలేడు. అది ఏదో ఒకే వ్యాధి లక్షణం అని 'డయాగ్నైజ్' చేసి ఆ వ్యాధిని నిర్మూలించడానికి ప్రయత్నం చేస్తారు. నేను చేసిన ఆపరేషన్ అదే. కాని, తరవాత తరవాత ప్రసాద్ పరిస్థితి గమనిస్తుంటే నాకు అనుమానం వచ్చింది. ఆ అనుమానం బలపడడానికి ఇంకో ఆరు నెలలు పట్టింది. ఈ వ్యాధి ఇంకో విచిత్రమైన లక్షణం ఏమిటంటే, రోగి మామూలు పరిస్థితులలో చాలా హుషారుగా ఉంటాడు. ఆ ఉత్సాహం చూసి డాక్టర్ వ్యాధి తగ్గుతోంది అనుకొని పొరపాటు పడడానికి ఆస్కారం కూడా ఉంది. నేను ఆపరేషన్ ఆ రోజు చేసిన తరవాత పదిహేను రోజుల పాటు ప్రసాద్



ఉత్సాహం చూసి ఆ ఆపరేషన్ విజయవంతమైందని అనుకున్నాను కూడా. వైద్య విజ్ఞానం ఎంతో ప్రగతిని సాధించినా ఈ వ్యాధి ఎలా వస్తుందో కాని, దానిని ఎలా నిర్మూలించాలో కాని ఎవ్వరికీ ఇంకా తెలియదు. ఎ. సి. టి. హెచ్. అనే హార్మోను ఇస్తారు. అది ఒక్కటే దీనికి మందు. కాని, తప్పకుండా పనిచేస్తుందని గారంటీ లేదు. అదృష్టముంటే పనిచేయవచ్చు. అదీ నేటి పరిస్థితి. ప్రసాద్‌ని ఇక్కడ చేర్పించిన తరవాత డాక్టర్ విక్టర్ వ్రాసిన మందు కూడా అదే. కొన్ని వ్యాధి లక్షణాలు మెదడుని ఆపరేట్ చేసి బాగు చేయవచ్చు. కాని, నే నిందాకా చెప్పినట్లు దాని ఉపయోగం చాలా తక్కువ. పైగా మెదడులోని కొన్ని భాగాలను ఆపరేట్ చెయ్యడానికి కొమ్ములు తిరిగిన న్యూరో సర్జన్స్ కూడా వెనకాడతారు. మనకు మెదడును గురించి తెలిసింది చాలా తక్కువ,రమేష్.అందుకే ఇందాక అన్నాను-నదిలో మునిగిపోతున్న పిల్లవాణ్ణి ఆదుకో లేని ఈత రాని వ్యక్తి నిస్సహాయత లాటిది నా పరిస్థితి. ఇక నా బాధ్యత గురించి. ఈ వ్యాధికి కారణం ఏమిటో తెలియదని ఇందాకా చెప్పాను. కాని, నేను ఆ రోజున చేసిన ఆపరేషన్ అగ్నికి ఆజ్యం పోసినట్లు చేసిందేమో అనే అనుమానం ఇప్పటికీ ఉంది నాకు. అది నిజం కాకపోవచ్చు అని నా వైద్య విజ్ఞానం చెప్తుంది. కాని, అదే వైద్య విజ్ఞానం ఈ వ్యాధి ఎందుకు వస్తుందో తెలియదని కూడా చెప్తూంది. ఏమో? ఎవ్వరు చెప్పగలరు? ప్రసాద్ పరిస్థితికి కారణం నేనేనేమో? అంతకు ముందర రోజున తీసుకున్న విస్కీ ఆపరేషన్ చేస్తున్నప్పుడు నా చేతులను చలింపజేసిందేమో? ఈ ఆపరేషన్‌లలో ఒక్కొక్కసారి అటువంటి పొరపాట్లు జరుగుతుంటాయి. పొరపాటు చేశామని కూడా మనకి తెలియకపోవచ్చు. నా మనస్సుని ఒక విధంగా చాలా సులభంగా సమాధాన పెట్టుకోగలను. కాని, అన్నివిధాలా ఆలోచిస్తే, నా బాధ్యత ఏమీ లేదని మాటికి నూరుపాళ్ళు చెప్ప లేను. అంతే, రమేష్, నేను చెప్పగలిగేది. ప్రసాద్ ఈ పరిస్థితికి నా బాధ్యత ఏమీ లేదంటావా?"

డాక్టర్ మధుసూదన్ నిజాయితీకి, ఆత్మ పరిశీలనకి రమేష్ ద్రవించిపోయాడు. ఆయన చేతులు కళ్ళకు అద్దుకుంటూ, "డాక్టర్! మీరు మహానుభావులు. ఇంతకన్నా ఇంకేమీ చెప్పడానికి నా భాష చాలదు" అన్నాడు రమేష్.

ఆ మాటలేమీ డాక్టర్ మధుసూదన్ చెవికి సోకలేదు. ఈ వేళ ఉదయం



దుష్ట శిక్షణ

ఫోటో—ఎన్. వి. రాఘవయ్య (విశాఖపట్నం)

ప్రసాద్‌కి ఎడమ కాలితో వచ్చిన శూలపు పోట్లు గురించే ఆలోచిస్తున్నాడు. ఆ పోట్లు ఇంకా ఉంటే పక్షవాతంలోకి దింపుతుంది. "పద, రమేష్, ప్రసాద్ ఈ పాటికి నిద్ర లేచి ఉంటాడు" అని హాస్పిటల్ వైపు దారి తీశాడు. ఇద్దరూ గది చేరేటప్పటికి ప్రసాద్ ప్రశాంతంగా నవ్వుతూ లతతో కబుర్లు చెపుతున్నాడు. అందరి మొహాలు వికసించాయి ప్రసాద్ ఉత్సాహం చూసి. ఆ రాత్రి తొమ్మిది గంటలకి బయట వెన్నెట్లో కూర్చున్నారు ముగ్గురూను. ప్రసాద్ అప్పుడే నిద్ర పోయాడు. చంద్రుడికేసి చూస్తూ అన్నాడు డాక్టర్ మధుసూదన్:

"మనిషి చంద్రుడిని జయించాడు. ఇంకో పదేళ్ళలో బహుశా అంగారక గ్రహం మీద కూడా కాలు పెడతాడు. వైద్య విజ్ఞానం కూడా ఎంతో ప్రగతి సాధించింది. కాని, మనం సాధించినదంతా మనం సాధించవలసిన దానితో పోలిస్తే ఏమీ లేదనిపిస్తుంది."

"మనిషికన్న బలవత్తరమైన శక్తి విధి. దానిని ఎప్పుడూ మనిషి జయించ లేడు. విధి తన ఆధిక్యాన్ని ఎప్పుడూ చూపిస్తూనే ఉంటుంది" అంది లత, డాక్టర్ మధుసూదన్ కేసి సూటిగా చూస్తూ.

"నేను ఆ వాదనతో ఏకీభవించలేను. ఈ విధి అన్నది మనిషి ప్రగతితోపాటు మారుతూనే ఉంది. ఉదాహరణకి: ఏభయి ఏళ్ళ క్రితం క్షయకు మందు లేదు. క్షయ వచ్చిన రోగిని చూసి జాలి పడి అంతా ఘటన, విధి ప్రతాపం అనుకొనే వారు. కాని, ఇప్పుడు తొంభయి శాతం క్షయని చాలా సులభంగా నిర్మూలించవచ్చు. అంటే విధి ప్రతాపాన్ని మానవ విజ్ఞానం అంతవరకు అదుపులో పెట్టిందన్న మాట. ఇప్పుడు నిర్మూలించ లేని వ్యాధులను భావితరం ఇట్టే సులభంగా నివారిస్తుందేమో? ఎవ్వరు చెప్ప గలరు?" అన్నాడు డాక్టర్ మధుసూదన్ చిరునవ్వు నవ్వుతూ.

మనిషిలో ఆయన కున్న నమ్మకానికి ఆశ్చర్యపోయారు రమేష్, లత.

ఆ రాత్రి అందరూ సుఖంగా నిద్ర పోయారు. లతకు కల వచ్చింది. 'ఏదో ఆలయంలోకి వెళ్ళింది పూజ చేద్దామని. ఆలయం చుట్టూ పూలమొక్కలతో రమణీయంగా ఉంది. పువ్వులు పళ్ళెంలో నింపుకొని గర్భగుడిలోకి వెళ్ళింది. కాని, ఆశ్చర్యం! మూలవిరాట్టు విగ్రహం లేదు! కళ్ళుమూసుకుని వెంకటేశ్వర స్వామిని ప్రార్థించింది. కళ్ళు తెరిచేసరికి ఒక విగ్రహం ఆ ఖాళీ ప్రదేశంలో ఉంది. భక్తితో పూజచేసింది. పూజ అయిన తరవాత పరీక్షగా మళ్ళా చూసింది విగ్రహం వైపు. విగ్రహం మొహం అచ్చు ప్రసాద్ మొహమే ... '

'ఒక రాజ్యం. రాజుగారికి పిల్లలు లేరు. హితైషులు అంతా దేవుడికి మొక్కుకోమన్నారు పిల్లలకోసం. దేవుడికి వేరే పని లేదా నాకు పిల్లలు కలిగించడం తప్పిస్తే? అయినా, నాకు పిల్లలు లేక పోతేనేం, రాజ్యంలోని ప్రజ అంతా నా పిల్లలు కారా అని అంటున్నాడు రాజు. కొంతకాలానికి రాణి గర్భవతి అయింది. రాణి ప్రసవవేదన పడుతూంది. ఆస్థాన వైద్యు లందరూ రాణిగారికి పరిచర్యలు చేస్తున్నారు. ఇంతలో రాజుగారికి జేజేలు కొడుతున్నారు ప్రజ అంతా, యువరాజు పుట్టినందుకు. డాక్టర్ మధుసూదన్ నిద్రలోనే చిరునవ్వు నవ్వుతున్నాడు.

'ఒక నది వరదల ఉద్ధృతంలో ఉంది. తన చేతిలో ఒక మంత్రదండం ఉంది. దండం చూపాడు నదివైపు. అంతే. నది నిలబడిపోయింది. నది దిగువ జనం హాహాకారాలు చేస్తున్నారు, నది ప్రవాహం ఆగిపోవడం చూసి. వాళ్ళని చూసి జాలి పడి తను దండం నదిలోకి విసిరివేశాడు. నది ప్రవాహం మామూలుగా సాగిపోతూంది. ప్రజలు హర్షధ్వానాలు చేస్తున్నారు. తను కూడా వాళ్ళతోపాటు సంతోషంతో చప్పట్లు కొడుతున్నాడు. చేతులు మంచంకోడుకి తగిలి మెలకువ వచ్చింది రమేష్‌కి. ప్రక్కకు ఒత్తిగిలి పడుకున్నాడు.

ఉదయం అందరూ ఒకేసారి లేచారు ప్రసాద్ మూల్గులకి. "అబ్బ! డాక్టర్... మళ్ళీ మొదలయ్యాయి ' ఈ శూలపు పోట్లు ... నిన్నటికన్న భయంకరంగా ఉన్నాయి ... భరించలేను ... ప్లీజ్ ... మత్తుమందు ఇవ్వండి ... అబ్బ ... డాక్టర్ ... లతా ... ఊఁ ..."

అందరూ ఒక్క క్షణం అచేతనంగా నిలబడ్డారు.

అది వెల్నూరు.
వెల్నూరు ప్రత్యేకత —
దేవుడు లేని ఆలయం.
రాజులేని కోట.
నీరులేని నది.
చలనంలేని జీవం.

**అంకితం:**
**మిత్రుడు**
**జి. ఎస్. శర్మకి**